క్లుప్తంగా

కర్నూల్‌కి వెళ్లి పింఛన్ అందజేత



కమ్మరి పెద్దనరసింహులుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరసింహులు

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కమ్మరి పెద్ద నరసింహులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ నరసింహులు కర్నూల్‌కు వెళ్లి పెద్దనరసింహులుకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న గృహ సారథులు

ఆదోని టౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సమస్యల పరిష్కారంపై గురువారం గృహసారథులు అవగాహన కల్పించారు. తిక్కస్వామి దర్గా సర్కిల్‌లో గృహసారథులు జిలేకాబీ ఆధ్వర్యంలో 16వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు వెళ్లి పథకాలను వివరించారు. పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకొస్తే అందేలా చర్యలు చేపడతామని చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల ప్రతిభ



బాలికల జట్టును అభినందిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : చిత్తూరు జిల్లా నగరిలో గత నెల 27 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ దైవాదీనంరెడ్డి, ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శులు నరసింహరాజు క్రీడాకారుణులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్, నరసయ్య, ఈరన్న, రామన్న, హరిత, గంగాధర్, సత్యనారాయణ, మాబాషా, హరిబాబు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తుల సందడి



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు భక్తులు గురువారం అధికంగా తరలి వచ్చారు. స్వామి వారి సమాధి వద్ద ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం



ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం మండలంలోని సచివాలయాలు, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి, ఆదోని మండల గౌరవాధ్యక్షులు గురునాథరెడ్డి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మునీర్‌అహ్మద్, పార్టీ సీనియర్ నాయకులు సిద్ధారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

నేడు అంతర్ పాఠశాలల ఖోఖో పోటీలు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఆదోని జోన్ లెవెల్ అంతర్ పాఠశాలల బాలికల ఖోఖో పోటీలు నిర్వహిస్తామని కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్, ఆర్గనైజర్ బాలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన బాలికలకు, 4న బాలురకు పోటీలు వేర్వేర్వుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బజాజ్ సాయి మోటార్స్ వారి సహకారంతో బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలన్నారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు

- ఆదోని సబ్ డివిజన్ పరిధిలో తొమ్మిది బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు
- సత్ఫలితాన్నిస్తున్న పోలీస్, రవాణా శాఖల కృషి
- అతివేగం, నిర్లక్ష్యం, మద్యపానం వల్లే దుర్ఘటనలు





ఎమ్మిగనూరు రోడ్డులో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్లు,(ఇన్‌సెట్) హైవేలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆదోనివాసి కారు (ఫైల్)

ఆదోని అర్బన్ : ప్రయాణంలో వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అధికారులు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు చివరకు భారీగా జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ, హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు ధరించకుండా, రాంగ్ రూట్‌లో నడపడం, అతివేగం, నిర్లక్ష్యం, నిద్రమత్తు కారణంగా అధిక శాతం ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వీటి నియంత్రణకు పోలీసు, రవాణా శాఖల అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టి నివారణ చర్యలు చేపట్టారు.

బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు..

ఆదోని సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాదాలు అధికంగా జరిగే రహదారులు, ప్రవేశాల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆయా ప్రదేశాల్లో హెచ్చరికల బోర్డులు, స్పీడు బ్రేకర్‌లు, రేడియం స్టిక్కర్‌లు, సోలార్ బ్లింకర్స్, జీబ్రా క్రాసింగ్‌లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వీటి కారణంగా కొంత మేర మార్పులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

సబ్‌డివిజన్ పరిధిలో 2019 – 2021 వరకు మూడు నుంచి పది కన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు తొమ్మిది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ ప్రదేశాల్లో పోలీసు, రవాణా, నేషనల్ హైవేస్, ఆర్ అండ్‌బీ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను విశ్లేషించాయి. ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డులో ఓవర్ స్పీడు ఎక్కువగా ఉందని గుర్తించి 600 మీటర్ల వరకు బ్లాక్ స్పాట్ ప్రాంతంగా ఎంచుకొని అక్కడ స్పీడు బ్రేకర్‌లు, సైన్ బోర్డులు, స్ట్రీట్ లైటు, డ్రమ్ములు ఏర్పాటు చేశారు. అలాగే మంత్రాలయం పరిధిలోని కల్లుదేవకుంట, చెట్నీహల్లి గ్రామ సమీపంలో ఓవర్ స్పీడు ఉందని గుర్తించి 500 మీటర్ల వరకు బ్లాక్ స్పాట్‌గా ఎంచుకుని రంబుల్ సిట్స్ స్పీడ్ మీటర్ బోర్డులను, కర్వ్ బోర్డు ప్రదర్శన, రేడియం పేయింటింగ్, నెమ్మదిగా వెళ్లాలనే సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. మాధవరం పరిధిలోని మాధవరం నుంచి మాలపల్లి గ్రామ సమీపం వరకు ఓవర్ స్పీడు, స్పీడు బ్రేకర్‌లు, స్ట్రీట్ లైట్స్, సైన్‌బోర్డులు లేవని గుర్తించి, అక్కడ 500 మీటర్ల వరకు స్పీడ్ బ్రేకర్‌లు, సైన్ బోర్డులు, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు పరిధిలో మాలదొడ్డి నుంచి రాళ్లదొడ్డి వరకు శివమూర్తి స్పిన్నింగ్ మిల్ నుంచి మంత్రాలయం రోడ్డు వరకు బోడబండ, చెన్నాపురం టర్నింగ్ వరకు, టౌన్‌లోని అన్నమయ్య సర్కిల్‌లో ఓవర్‌స్పీడు, రోడ్స్ లైట్ టర్నింగ్, వాగుల రోడ్డు, అప్ అండ్ డౌన్ రోడ్లు ఉన్నాయని గుర్తించి 500 మీటర్ల వరకు ఆయా ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్‌గా ఎంచుకుని అక్కడ స్పీడు బ్రేకర్‌లు, బ్లికింగ్ స్టడ్స్, సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. ప్రమాదాల్లో అధికశాతం యువకులే ప్రాణాలు పోగొట్టుకున్నారని అధికారుల లెక్కలు పేర్కొంటున్నాయి.

ప్రమాదాలు ఇలా..

జిల్లాలో 2020-21లో 1,185 రోడ్డు ప్రమాదాలు జరగగా, 620 మంది మరణించారు. 1,300 మంది క్షతగాత్రులుగా మారారు. 2021-22 నవంబర్ వరకు 852 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, 400 మంది మృతి చెందారు. 800 మంది క్షతగాత్రులుగా మారారు. సబ్ డివిజన్ పరిధిలో 2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు 110 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 122 మంది చనిపోగా, 71 మంది గాయాలపాలయ్యారు.

వాహనదారులకు సూచనలు..

- వాహనదారులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలి. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులు రోడ్డుపాలవుతారనేది గుర్తుంచుకోవాలి.
- తల్లిదండ్రులు.. పిల్లల సంతోషం కోసం వాహనాలను కొనిచ్చి ప్రమాదం జరిగితే శోకసంద్రంలో మునిగిపోవాల్సి వస్తుంది.
- యువత ట్రిపుల్ రైడింగ్, అధిక వేగం, రేసింగ్ లాంటివి మానుకోవాలి.
- మద్యం సేవించి నడపడటం, వాహనాల్లో మితిమీరి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడొద్దు.
- రాత్రివేళల్లో నిద్ర వస్తే వెంటనే ఓ చోట వాహనాన్ని నిలిపి నిద్రించాలి.

బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో ప్రమాదాలు తగ్గించాం



రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. హైవేలో మూడు నుంచి పది కన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు తొమ్మిది ఉన్నట్లు గుర్తించి, సమయం, కారణాలు తెలుసుకుని చర్యలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి చర్యలు చేపడుతున్నాం. గత మూడేళ్లలో ఈ తొమ్మిది స్పాట్‌లలో 56 మంది మరణించారు. మేం చేపట్టిన చర్యల వల్ల ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి. అంతేగాకుండా ఆలూరు, మాధవరం, ఆలూరు నుంచి ఆస్పరి, ఆలూరు-ఆదోని-మాధవరం ప్రాంతాల్లో పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశాం. ఇవి మంచి ఫలితాన్నిచ్చాయి. అంతేగాకుండా గ్రామాల వద్ద మలుపు, జంక్షన్‌ల వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అజాగ్రత్త వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం.

– వినోద్‌కుమార్, ఆదోని డీఎస్పీ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మంత్రాలయం రూరల్: ఈ నెల 13వ తేదీన జరిగే ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జయప్రదం చేయండి

పెద్దకడబూరు : ఈ నెల 5, 6వ తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరిగే ఆపస్ (ఏపీయూఎస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ప్రాణేష్ ఆచారి పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను హెచ్‌ఎం రామమూర్తి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రాణేష్ మాట్లాడుతూ కరువు భత్యం, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, ఉమ్మడి సర్వీసు రూల్స్ తదితర సమస్యలపై రాష్ట్ర మహాసభలో తీర్మానం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, భూలక్ష్మి, సునీత,స్వర్ణలత, కృష్ణ, శేఖరప్ప, సువర్ణ పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

ఆదోనిటౌన్ : పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో క్షయవ్యాధిపై గురువారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మాక్ సెంటర్‌లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు స్థానికులకు హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు అవగాహన కల్పించారు. క్షయవ్యాధిని 2024 నాటికి పూర్తిగా తరిమికొడదామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను వివరించారు.

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పలు వసతి గృహాల్లో సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో బస చేసిన వారి వివరాలను పరిశీలించారు. అనుమానితల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు రికార్డులు సక్రమంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ఏర్పాటు చేసుకున్న చోట అవి పని చేసేలా చూసుకోవాలని చెప్పారు. బస చేసే వారి పూర్తి వివరాలను సేకరించిన తర్వాతనే వసతి కేటాయించాలన్నారు.

వంట గ్యాస్ ధరను తగ్గించాలి



పెద్దకడబూరులో తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మల రామన్న డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్యులపై పెద్ద ఎత్తున భారం మోపుతుందని మండిపడ్డారు. 2014లో రూ.410 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,155 చేరిందన్నారు. గృహ వినియోగానికి వాడే వంటగ్యాస్ మీద రూ. 50లు, వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై రూ.350లు భారం మోపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజల్ ధరలు పెరిగి నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, గ్యాస్ ధర మళ్లీ పెంచడంతో పేదలు తిండి దూరమయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. త్వరలో పేదలు గ్యాస్‌ను వదిలి మళ్లీ కట్టెల పొయ్యిల వైపు మళ్లుతారని చెప్పారు. అనంతరం తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, పరమేష్, దాసు, చిరంజీవి, రాధమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కౌతాళం: పెంచిన గ్యాస్ ధరల్ని వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక వాల్మీకి సర్కిల్‌లో నిరసన తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పేదల జీవితాలను మారుస్తానని 2014లో అధికారం చేపట్టిన బీజేపీ రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,155కు పెంచి పేదల జీవితాలను రోడ్డు పాలు చేసిందని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ ఈరన్న, వీరేష్, మారయ్య, తాయప్ప, జగ్గప్ప పాల్గొన్నారు.

పీడీల నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదోని అర్బన్ :స్థానిక నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదోని జోన్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదోని జోన్ పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్‌ల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరైన కార్యక్రమానికి హెచ్‌ఎం హలీమ్‌సిద్ధికీ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు ఏపీ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్, పుల్లన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ నిర్వాహక కార్యదర్శి రమణారెడ్డి, ట్రెజరర్ లతీఫ్ పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ ప్రకటించారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ కమ్మిరెడ్డి, అధ్యక్షులుగా అంజనమ్మ, ప్రధాన కార్యదర్శిగా ముజహిద్ హుసేన్, ట్రెజరర్‌గా శివకుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా రామస్వామి, జాయింట్ సెక్రటరీగా చక్రపాణి, చీఫ్ అడ్వైజర్‌గా రాజారామ్మోహన్ బాబు, కో-ఆర్డినేటర్‌లుగా రవికుమార్, కె.బాలు, జగన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూపాల్‌రెడ్డి, హెచ్‌ఎంల సంఘం ఆదోని డివిజన్ అధ్యక్షుడు రామమూర్తి, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ మాటలు హాస్యాస్పదం



మధుసూదన్ శర్మ

ఆదోని అర్బన్ : నకిలీ సంఘానికి అధ్యక్షుడిగా చెప్పుకుని రాష్ట్రంలో తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ నిర్వీర్యమైందని అబద్ధాలన్నీ చెప్పుకుంటూ తిరుగుతున్న సత్యవాడ దుర్గాప్రసాద్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2016లో రాష్ట్రంలోని ఏ బ్రాహ్మణ సంఘంలో కూడా కనీసం సభ్యత్వం కూడా లేని దుర్గాప్రసాద్‌ను కొందరు స్వార్థపరులు వాళ్ల ఆర్థిక అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ప్రకటించారు. ఆ విషయం తెలియని ఈ నకిలీ సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు నిధులు ఇస్తామని చెప్పి ఐదేళ్లలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి కలిపి కేవలం రూ.180 కోట్లు ఇచ్చి మోసం చేసిందని గుర్తు చేశారు. అమ్మ ఒడి ద్వారా ఒకటవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బ్రాహ్మణ విద్యార్థులకు ఏటా దాదాపు 42 వేల మందికి లబ్ధి చేకూరుతుందనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఒక్క విద్యార్థికి కూడా లబ్ధి చేకూరలేదనేది నిజం కాదా అని నిలదీశారు.

12 మంది బైండోవర్

మంత్రాలయం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. 12 మందిని తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట హాజరుపరిచారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక కార్యాకాలపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీల్‌చైర్‌ల అందజేత

మంత్రాలయం రూరల్: మండల కేంద్రానికి చెందిన చంద్రకళ, ఉపేంద్రప్ప కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కాళ్లు కోల్పోయారు. విషయం తెలుసుకున్న 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి తన సొంత సొమ్ముతో ఇద్దరికీ వీల్‌చైర్‌లను ఉచితంగా గురువారం అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ విజయ్, పైలెట్ కొండయ్య, డీఈవో పెద్దయ్య ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



రియాజ్

ఆలూరు రూరల్: హత్తిబెళగల్ జెడ్పీ పాఠశాల 7వ తరగతి విద్యార్థి రియాజ్ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. రియాజ్ గత నెల 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికై నట్లు చెప్పారు.

బదినేహాల్‌లో చోరీ



బీరువాను పగలగొట్టిన దృశ్యం

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలోని శేకమ్మ గుడిసెలో గురువారం చోరీ జరిగిందని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శేకమ్మ రోజువారి మాదిరిగా.. పొలం పనులకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెలో చొరబడి బీరువా తాళాలను పగలగొట్టి అందులోని రెండు తులాల బంగారం, 40 తులాల వెండితో పాటు పది వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. దొంగలకు కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చేయండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్ : ఆదోని, కుప్పగల్ రైల్వేస్టేషన్‌లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదని వాటిని ఆపేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రముఖులు, శ్రీ ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం, ఖాదర్‌లింగస్వామి దర్గా కమిటీల నిర్వాహకులు గురువారం సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదోని-మంత్రాలయం నియోజకవర్గాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే భక్తులకు రైళ్ల సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. నాందేడ్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22157/22158), చెన్నై-ఎగ్మోర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లు కుప్పగల్, ఆదోనిలో ఆపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైళ్లను ఆపేలా చూస్తామని హామీ ఇచ్చారు.

భవిష్యత్తు ఐటీ రంగానిదే



మాట్లాడుతున్న ఐటీ రంగ నిపుణుడు కుమారస్వామి

ఎమ్మిగనూరుటౌన్: భవిష్యత్తు ఐటీ రంగానిదే అని, విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాష, లండన్‌లో స్థిరపడ్డ ఐటీ రంగ నిపుణుడు కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాలలో ఐటీ విభాగంలో ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్నదంతా సాంకేతిక విప్లవమన్నారు. అందుకు అనుగుణంగా సాఫ్ట్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. జావా, పైథాన్, హెచ్‌టీఎంఐ మొదలైన ప్రోగ్రాం లాంగ్వేజెస్‌లో నైపుణ్యాలు పెంచుకోవడంపై మెలకువలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకులు నాగప్రదీప్, మనోరంజన్, మద్దిలేటి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

నందవరం: టి.సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మ, మారెమ్మవ్వ దేవర సందర్భంగా గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. మొదటి స్థానంలో మహేష్ ఎద్దులు నిలిచి రూ.20,016 నగదు కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో నిలిచిన గోరంట్ల వృషభాలు రూ.15,016, మూడో స్థానంలో అదే గ్రామానికి చెందిన సోమన్న ఎద్లు నిలిచి రూ.10,016 గెలుపొందాయి. నాల్గవ స్థానంలో నాగరాజు ఎద్లు నిలిచి రూ.5,016 గెలుపొందాయి. దాతలు వెంకటేశ్వర్‌రెడ్డి, బాలముని, నరసింహులు, మోహన్‌రెడ్డి, సోమన్న చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

రైల్వేగేటును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విరిగిపోయిన గేటు

కోసిగి: మండల కేంద్రంలో రైల్వే గేటును ఆదోనికి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విరిగిపోయింది. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో రైలు వస్తుండటంతో గేట్‌మెన్ గేటు వేసేందుకు సైరన్ ఇచ్చాడు. అంతలో కోసిగి నుంచి ఐరన్‌గల్ (ఏపీ21జడ్0276) నంబర్ గల బస్సు గేటును దాటి వెళ్లిపోవాలని హారన్ కొడుతూ దూసుకొచ్చాడు. వేగంగా వెళ్లే క్రమంలో గేటును దాటుతుండగా బస్సు పై భాగంలోనున్న క్యారియర్ గేటుకు తగలడంతో మధ్యలో విరిగి పోయింది. దీంతో రైలు రాక కోసం గేటు వేయలేకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గేట్‌మెన్ అప్రమత్తమై రైల్వే స్టేషన్ అధికారులు సమచారం అందించి వాహనాలను ఎక్కడిక్కడే నిలిపి వేసి తాత్కాలిక గేటు ఏర్పాటు చేశారు. అయితే రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గేట్‌మెన్ ఆదోని రైల్వే పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

ఆదోని రూరల్: మదిరె గ్రామానికి చెందిన వెంకటేష్ (20) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్సీ పోలీసులు తెలిపిన వివరాలు.. కొంత కాలంగా వెంకటేష్ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

వైభవంగా బసవేశ్వర స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య ప్రభోత్సవం జరుగుతున్న దృశ్యం



ఉత్సవంలో పాల్గొన్న వై.సీతారామిరెడ్డి

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ బసవేశ్వర స్వామి ప్రభోత్సవం గురువారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య అత్యంత వైభవంగా సాగింది. వేకువజాము నుంచి ఆలయ అర్చకులు ఈశ్వరయ్య స్వామి, చెన్న బసవ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళ హారతులు తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారికి నైవేద్యం, నారికేలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంకాలం సంప్రదాయయబద్ధంగా ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుంచి కలశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, నందికోలు సేవ మధ్య ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చారు. అనంతరం ప్రభపై స్వామి వారిని అధిష్టింపజేసి స్వామి వారి పాదాల చెంత వరకు ఊరేగించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు ప్రభపై అరటి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. సీతారామిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, సీనియర్ నాయకులు నాడుగేని నరసింహులు, జగదీష్ స్వామి, గ్రామ సర్పంచ్ హరోన్, బసిరెడ్డి, నాడుగేని నాగరాజు, దొడ్డి నరసన్న పాల్గొన్నారు.